క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

తుర్కయంజాల్: తుర్కయంజాల్ సబ్ స్టేషన్ మరమ్మతుల కారాణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమ్మగూడ, రాగన్నగూడ, మన్నెగూడ, తుర్కయంజాల్ పరిధిలోని కాలనీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. అదేవిధంగా తొర్రూర్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా తొర్రూర్, మునగనూర్, కొహెడలో మధ్యాహ్నం 3గంటల నుంచి సాయింత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా నిలివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

తలకొండపల్లి: మండల పరిధిలోని చుక్కాపూర్ శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ఈనెల 30 వరకు కొనసాగుతాయని ఆలయ అర్చకులు వెంకటేశ్వరశర్మ, మాజీ ఎంపీటీసీ యాదయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 28న ఉదయం 11గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవం, 29న బండ్లు తిరుగుట, రథోత్సవం, 30న సత్యనారాయణస్వామి రథం తదితర కార్యక్రమాలు నిర్వహించబడున్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కల్యాణం తిలకించాలని నిర్వాహకులు కోరారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని చుక్కాపూర్‌కు చెందిన లక్ష్మమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. శుక్రవారం మార్కెట్ కమిటీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5000 ఆర్థిక సహాయం అందజేశారు. రైతుబంధు కోఆర్డినేటర్ మల్లారెడ్డి, మల్లేశ్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, కృష్ణ, సాయినాథ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి..

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డుకు చెందిన గణేశ్ అనారోగ్యంతో మృతిచెందాడు. ఆమనగల్లు మున్సిపల్ టీఆర్‌ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్, మాజీ వార్డు సభ్యుడు సాయిలు, నాయకులు నిరంజన్‌గౌడ్, వెంకటేశ్, భాస్కర్, యాదయ్య, జంతుక అల్లాజీ తదితరులు మృతుడి కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించారు. అలాగే మృతుడి కుటుంబ సభ్యులను ఉప్పల చారిటబుల్ ట్రస్టు సభ్యులు పరామర్శించి ట్రస్టు తరఫున రూ.3వేలు అందించారు. సభ్యులు నాగిళ్ల జగన్, మహేశ్, మల్లేశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు సిలిండర్ అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని రాంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు స్థానిక శ్రీలక్ష్మీవేంకటేశ్వర దేవాలయ చైర్మన్ శ్రీశైలం వ్యక్తిగతంగా తన సొంత ఖర్చుతో శుక్రవారం సిలిండర్ అందజేశారు. మధ్యాహ్నా భోజనం వంట చేయడానికి ఇబ్బంది పడుతున్నామని వంట సిబ్బంది కోరిన వెంటనే సిలిడంర్ అందజేసినట్లు శ్రీశైలం తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ శ్యాంసుందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ మోహన్‌రెడ్డి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.


నర్సయ్యకు సన్మానం



నర్సయ్యను సన్మానించిన అధ్యాపక బృందం

ఇబ్రహీంపట్నం: అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందిన డా.ఎస్ నర్సయ్యను ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభు, అధ్యాపక బృందం ఘనంగా సన్మానించారు. జువాలజీ సబ్జెక్టును బోధించే నర్సయ్య 2010 నుంచి డిగ్రీ కళాశాల లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. తాజాగా పదోన్నతి పొందిన నర్సయ్యను శుక్రవారం తోటి అధ్యాపక బృందం సభ్యులు ఘనంగా సన్మానించి అభినందలు తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ కమ్లీ

కడ్తాల్: తండాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు.మండల పరిధిలోని పెద్దవేములోనిబావితండా పంచాయతీలో ఎన్ఆర్ఈజీఎస్, జెడ్పీ నిధులు రూ.10లక్షలతో చేపట్టిన సీసీరోడ్ల నిర్మాణ పనులకు ఎంపీపీ, జెడ్పీటీసీ శుక్రవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ గిరిజన తండాలను నూతన పంచాయతీలుగా ఏర్పాటు చేసి తండాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్వేత, ఉప సర్పంచ్ స్వాతి,నాయకులు బాబులాల్, వాల్య, పుల్యా, బుజ్జి, సంధ్యా, నాయకులు రాములు, పాండు, జగన్ తదితరులు ఉన్నారు.

ప్రారంభానికి ముందే శిథిలావస్థకు..

- యాచారం అతిథి గృహం నిర్మించి మూడేళ్లు పూర్తి
- వినియోగంలోకి తేకపోవడంతో ఫర్నిచర్, తలుపులకు చెదలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

యాచారం: జెడ్పీ అతిథి గృహం ఆతిథ్యం ఇవ్వక ముందే శిథిలావస్థకు చేరుకుంది. రూ.లక్షల ప్రజాధనం వృథా అవుతున్న పట్టించుకునే వారే లేరు. ప్రారంభానికి ముందే భవనానికి పూర్తిగా పగుళ్లు ఏర్పడ్డాయి. వివరాల్లోకి వెళ్తే.. యాచారం మండల కేంద్రంలో ఏడేళ్ల క్రితం రూ.20 లక్షల నిధులతో జెడ్పీ అతిథి గృహ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఏళ్లుగా నిర్మాణ పనులు కొనసాగి మూడేళ్ల కిందట భవన నిర్మాణం పూర్తయింది. దీంతో రూ.రెండున్నర లక్షలు ఖర్చు చేసి అతిథి గృహంలో ఫర్నిచర్ తెచ్చి పెట్టారు. ఆ తర్వాత కిటికీలు బాగా లేవని బిగించిన కిటికీలను తీసేసారు. వాటి స్థానంలో మరలా కిటికీలు బిగించలేదు. దీంతో అతిథి గృహం లోపల పక్షులు గూడ్లు కట్టుకుని నివసిస్తున్నాయి. దీంతో లోపల అపరిశుభ్రత నెలకొంది. తలుపుల వద్ద పగుళ్లు ఏర్పడటంతో విషసర్పాలు లోనికి ప్రవేశిస్తున్నాయి.



జెడ్పీ అతిథి గృహం (ఇన్‌సెట్‌లో) ధ్వంసమైన ఫర్నిచర్

పాడవుతున్న ఫర్నిచర్..

గదుల్లో ఉన్న విలువైన ఫర్నిచర్‌కు పూర్తిగా దుమ్ము, ధూళి పట్టి ఎలుకలు కొరికేస్తున్నాయి. మరో రూ.రెండు నుంచి మూడు లక్షలు ఖర్చు చేస్తే ఈ భవనం వాడుకలోకి వచ్చే అవకాశం ఉన్నప్పటికి ఉపయోగంలోకి తీసుకవచ్చే విషయంలో శ్రద్ధ పెట్టేవారే లేరు. మిగతా నిధులు వెచ్చించి అతిథి గృహంలోని మైనర్ రిపేర్లు పూర్తిచేయించడంతో పాటు భవనాన్ని ప్రారంభిస్తే అతిథులకు ఆతిథ్యం అవకాశం ఉంటుంది. ఆ దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేయిస్తాం



జెడ్పీ అతిథి గృహంలో చిన్న, చిన్న మరమ్మతు పనులు చేయాల్సి ఉంది. రూ.రెండున్నర లక్షల నిధులతో భవనాన్ని వాడుకలోకి తెచ్చే అవకాశం ఉంది. నిధులు లేకపోవడంతోనే పనులు పూర్తికాలేదు. పాత కిటికీల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తాం. ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీడీఓలతో మాట్లాడి మరమ్మతుల పనులు త్వరగా పూర్తిచేయిస్తాం.

– ఉస్మాన్, పంచాయతీ రాజ్ ఏఈ, యాచారం

ఆలయాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

- కనుల పండువగా శివాలయం మొదటి వార్షికోత్సవం

మాడ్గుల: పురాతన ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటునందిస్తుందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మాడ్గులలోని శివాలయం వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం జరిగిన పూజా కార్యక్రమాలకు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ హాజరయ్యారు. ఆలయ ఆవరణలో సీసీ రోడ్డు నిర్మాణం కోసం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ రూ.10 లక్షల నిధులు మంజూరు చేస్తూ ప్రొసీడింగ్ పత్రాలను ఆలయ కమిటీ చైర్మన్ సూదిని పద్మారెడ్డికి అందజేశారు. ఆయన వెంట మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు జంగయ్యగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ తిరుమల్‌రెడ్డి, పట్టాభినారాయణ రెడ్డి, విష్ణు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ ప్రత్యేక పూజలు..

శివాలయంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొన్నారు. అనంతరం మాడ్గులకు చెందిన బి.లక్ష్మమ్మకు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.60 వేల చెక్కును ఎమ్మెల్సీ అందజేశారు. మాజీ ఎంపీపీలు రాంరెడ్డి, జంగయ్య, మాజీ పీఏసీఎస్ చైర్మన్ బొజ్జమోహన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ దేవయ్యగౌడ్ ఉన్నారు. శివాలయ అభివృద్ధికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి రూ.10 లక్షల విరాళం ప్రకటించారు. వార్షికోత్సవంలో పాల్గొన్న సుంకిరెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

తలకొండపల్లి: అనారోగ్యంతో చికిత్స పొందుతున్న మండల పరిధిలోని చెన్నారంకు చెందిన రాత్లావత్ బుజ్జికి రూ.16,000, పెంటమ్మకు రూ.16,000 సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఎమ్మెల్యే మంచిరెడ్డి సిఫార్సు మేరకు మంజూరయ్యాయి. సంబంధిత చెక్కులను శుక్రవారం మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి చెన్నారం వెళ్లి సర్పంచ్ స్వప్న, భాస్కర్‌రెడ్డి కలిసి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. నాయకులు.. భాస్కర్‌రెడ్డి, రాములు, ఈదపురెడ్డి, నర్సింహ, శ్రీను, గణేషు తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి నివేదన యాత్రకు తరలిరండి

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్

మంచాల: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి నిర్వహిస్తున్న ప్రగతి నివేదన పాదయాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చీరాల రమేష్ అన్నారు. శుక్రవారం మంచాల మండల కేంద్రంలో నిర్వహించిన మండల విస్తృత స్థాయి నేతల సమావేశంలో రమేష్ పాల్గొని మాట్లాడారు. ఫిబ్రవరి 1వ తేదీన మంచాల మండలంలోని రంగాపూర్ గ్రామానికి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి పాదయాత్ర చేరుకుంటుందన్నారు. ఆ రోజున మండలంలోని నాయకులు, కార్యకర్తలు రంగాపూర్‌కు పెద్దఎత్తున చేరుకోవాలన్నారు. అదేవిధంగా ఈనెల 29న మంచాల మండలంలోని రంగాపూర్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మంచాల ఎంపీపీ నర్మద, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పావని, జానీపాషా, యాదయ్య, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బహదూర్, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

ఏకాభిప్రాయం కుదిరేనా?

- రసవత్తరంగా మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠం ఒప్పందం
- తుర్కయంజాల్‌లో కాంగ్రెస్ కౌన్సిలర్లు, నాయకుల సమావేశం

తుర్కయంజాల్: మున్సిపల్ చైర్‌పర్సన్ పదవికి సంబంధించి చేసుకున్న ఒప్పందం గడువు ముగియడంతో చైర్‌పర్సన్ మార్పుపై కొందరు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, వారి భర్తలు, కోఆప్షన్ సభ్యులు, రొక్కం భీంరెడ్డి, ముఖ్య నాయకులు తుర్కయంజాల్‌లోని రొక్కం సత్తిరెడ్డి గార్డెన్స్‌లో శుక్రవారం సమావేశమయ్యారు. ముందుగా అనుకున్నదాని ప్రకారం తొర్రూర్‌లో మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి క్యాంపు కార్యాలయం వద్ద సమావేశం ఏర్పాటు చేసుకోవాల్సి ఉండగా ఆయన అందుబాటులో లేకపోవడంతో రొక్కం సత్తిరెడ్డి గార్డెన్స్‌లో సమావేశం నిర్వహించారు. 2020 జనవరిలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు అనంతరం చైర్‌పర్సన్ ఎన్నిక సమయంలో మల్‌రెడ్డి అనురాధ, రొక్కం అనిత మధ్య.. చైర్‌పర్సన్ పదవిని చెరో రెండున్నరేళ్లు పంచుకుందామని పెద్దల సమక్షంలో ఒప్పందం చేసుకున్న విషయం అందరికీ తెలిసిందే.

గడువు ముగిసినా...

ఒప్పందం ప్రకారం రెండున్నరేళ్ల అనంతరం రొక్కం అనితకు చైర్‌పర్సన్ పదవిని అప్పగించాల్సి ఉన్నప్పటికీ ఆరునెలల క్రితం జనవరి 2023 వరకు గడువు కోరారు. మరో రెండు రోజుల్లో జనవరి నెల కూడా ముగియనుండటంతో పదవి పంపకం విషయం మరోసారి చర్చకు వచ్చింది. రెండు రోజుల్లో ఈ విషయంపై మరోమారు సమావేశం నిర్వహిద్దామని నాయకులు స్పష్టం చేశారు.



సమావేశమైన కాంగ్రెస్ నాయకులు

సైబర్ మోసాలపై సమాచారమివ్వండి

ఏసీపీ హరికృష్ణ



సదస్సులో పాల్గొన్న ఏసీపీ హరికృష్ణ తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని గుంతపల్లి గ్రామంలో గల అవంతి విద్యాసంస్థల ఆవరణలో శుక్రవారం విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సైబర్ క్రైం ఏసీపీ హరికృష్ణ, ఇన్‌స్పెక్టర్లు సురేందర్, స్వామి హాజరై విద్యార్థులతో మాట్లాడారు. సెల్‌ఫోన్లకు వచ్చే ఓటీపీలను ఇతరులతో పంచుకోకూడదని, సైబర్ నేరగాళ్లు అమాయకులు, యువతిలు, మహిళలనే టార్గెట్‌గా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారన్నారు. సైబర్ నేరగాళ్ల ఆగడాలు ఎక్కువైతే 1930 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ రామచంద్రారెడ్డి, బాలాజీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వసతి గృహంలో..

యాచారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ వసతి గృహంలో శుక్రవారం రాచకొండ పోలీసులు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ లింగయ్య ఆధ్వర్యంలో ఎస్ఐ ప్రసాద్‌కుమార్ సైబర్ నేరాలు, డయల్ 100పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రాచకొండ కళాబృందం సభ్యులు పాటల రూపంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అలాగే యాచారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరాస్తా వద్ద శుక్రవారం ఎస్ఐ ప్రసాద్‌కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ట్రాఫిక్ నింబంధనలు అతిక్రమించిన వారికి జరిమానాలు విధించారు.

నేడు సర్వసభ్య సమావేశం

ఆమనగల్లు: ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలోని సమావేశపు హాలులో శనివారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఫారూక్‌హుస్సేన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అనిత అధ్యక్షతన జరిగే సమావేశానికి మండల పరిధిలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి

టీపీసీసీ కార్యదర్శి దండెం రాంరెడ్డి

మంచాల: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగిఉండాలని టీపీసీసీ కార్యదర్శి దండెం రాంరెడ్డి అన్నారు. మంచాల మండల కేంద్రంలోని శ్రీహరిహర మహాక్షేత్రం దేవాలయ నిర్మాణం సహాయార్థం శుక్రవారం ఆయన రూ.1,00,116 అందజేశారు. ఆలయ అభివృద్ధికి తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. మంచాల సర్పంచ్ జగన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు నరేందర్‌రెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు లింగం, రాజేష్‌కుమార్, సత్యనారాయణ, హరికృష్ణరెడ్డి, శంకర్, వీరప్ప, ఈశ్వర్, మహిపాల్‌రెడ్డి, పవన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులకు తోడ్పాటునిద్దాం

కడ్తాల్: విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల అభివృద్ధికి ప్రతిఒక్కరూ తోడ్పాటునందించాలని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని మైసిగండి ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే ఉద్దేశ్యంతో దివంగత అయిళ్ల శంకరయ్యగౌడ్ జ్ఞాపకార్థం వారికుటుంబ సభ్యులు అయిళ్ల లక్ష్మమ్మ, అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, పద్మశ్రీ రూ.50వేలు విలువచేసే వాటర్ ఫిల్టర్‌ను శుక్రవారం పాఠశాల సిబ్బందికి అందజేశారు. సర్పంచ్ రమావత్ తులసీరాంనాయక్, మాజీ సర్పంచ్ శేఖర్‌గౌడ్, నాయకులు జవహర్‌లాల్, రెడ్యా, హీరాసింగ్, రాందాస్‌నాయక్, తులసీరాం, రామునాయక్, ఉపాధ్యాయులు ఉన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

మంచాల: నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి సంవత్సరం 10వ తరగతి చదువుతున్న తెలుగు మరియు ఇంగ్లిష్ మీడియం విద్యార్థులకు మర్రి నిరంజన్ రెడ్డి ఫౌండేషన్ ద్వారా ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేస్తున్నామని మంచాల జెడ్పీటీసీ మర్రి నిత్యనిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండంలోని లింగంపల్లి హైస్కూల్, మంచాల హైస్కూల్, కస్తూర్బా కేజీబీవీ, జాపాల హైస్కూల్‌లో తెలుగు, ఇంగ్లిష్ మీడియం విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ఆమె అందజేశారు. ఈ కార్యక్రమంలో లింగంపల్లి సర్పంచ్ వినోద మూర్తి, జాపాల సర్పంచ్ సహీద్ రవూఫ్, ఎంపీటీసీ చంద్రశేఖర్ రెడ్డి, పంచాయతీ సెక్రెటరీ రాజ్‌కుమార్, లింగంపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, స్కూల్ చైర్మన్ పర్వతాలు, మంచాల హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు నారన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలతో రైతులకు నష్టం

సబ్‌స్టేషన్ ఎదుట బీజేవైఎం నేతల నిరసన



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తలకొండపల్లి: వ్యవసాయ రంగానికి ఉచితంగా 24 గంటల నిరంతర విద్యుత్ సరాఫరా చేయాలని బీజేవైఎం కాలేజ్ ఔట్‌రీచ్ రాష్ట్ర కన్వీనర్ నీలకంఠం పాండు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పాండు మాట్లాడుతూ.. రైతులకు 24 గంటల పాటు నాణ్యమైన ఉచిత విద్యుత్ ఇస్తున్నామని చెప్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. ప్రస్తుతం కేవలం పంటల సాగుకు 7 గంటలు మాత్రమే విద్యుత్‌ను సరాఫరా చేస్తోందని ఆరోపించారు. వరి తదితర పంటల నాట్లు వేసే సమయంలో విద్యుత్ కోతలు విధించడం సమంజసం కాదన్నారు. కరెంట్ కోతలతో వ్యవసాయ బోర్ల నుంచి పంటలకు నీరందక రైతులు ఇక్కట్లు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరాపై దృష్టి సారించాలన్నారు. అనంతరం విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేశారు బీజేవైఎం తాలూకా ఇన్‌చార్జి అనిల్, మండల అధ్యక్షుడు రవిగౌడ్, ఉపాధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, రవి, రమేష్, గణేషు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునఃనిర్మాణానికి విరాళం

ఆమనగల్లు: మాడ్గుల మండలం కొల్కులపల్లి గ్రామంలో పునర్నిర్మిస్తున్న శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ నిర్మాణం కోసం గ్రామానికి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ మసున రామనాథం రూ.51,116 విరాళంగా అందించారు. కొల్కులపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ బట్టు అనురాధ, ఎంపీటీసీ బట్టు కిషన్‌రెడ్డికు.. రామనాథం విరాళానికి సంబంధించిన చెక్కున అందజేశారు. తన తల్లిదండ్రుల (కీ.శే. మసున వీరయ్య, కీ.శే. మసున రుక్కమ్మ) జ్ఞాపకార్థం విరాళం అందజేసినట్లు రామనాథం తెలిపారు. ఈ సందర్భంగా రామనాథంను.. సర్పంచ్, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం భాస్కర్‌రెడ్డి, ఉప సర్పంచ్ దానయ్యగౌడ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



సర్పంచ్‌కు చెక్కు అందజేస్తున్న రామనాథం

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: రాష్ట్రంలో బీఆర్ఎస్ సర్కార్ ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారంలోని పద్మావతి గార్డెన్స్‌లో శుక్రవారం మండల అధ్యక్షుడు కిషన్‌గౌడ్ అధ్యక్షతన పిగ్లీపూర్, బాటసింగారం, జాఫర్‌గూడ, మజీద్‌పూర్, గుంతపల్లి, అనాజ్‌పూర్, గండిచెరువు, లష్కర్‌గూడ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్‌తో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. సొంతపార్టీ నాయకుల మధ్యన ఉన్న విబేధాలు, మనస్పర్థలు పక్కన పెట్టి కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సొంత పార్టీ కార్యకర్తలకు అధికారిక కార్యక్రమాల్లో, పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని క్యామ మల్లేశ్ ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి, సర్పంచ్‌లు రాధ, లతాశ్రీ, లావణ్య, స్వరూప, మాజీ అధ్యక్షుడు చక్రవర్తిగౌడ్, నాయకులు పాల్గొన్నారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

పీసీసీ ఉపాధ్యక్షుడు మల్‌రెడ్డి రంగారెడ్డి



మహిళలతో మాట్లాడుతున్న మల్‌రెడ్డి రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: రాష్ట్రంలో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని పీసీసీ ఉపాధ్యక్షుడు మల్‌రెడ్డిరంగారెడ్డి అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపుమేరకు 'హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్ర' పేరుతో గురువారం సాయంత్రం అబ్దుల్లాపూర్ మెట్ మండలం బండరావిరాల, చిన్న రావిరాల గ్రామాల్లో మల్‌రెడ్డి పాదయాత్ర చేశారు. అంతకు ముందు పీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డితో కలిసి అబ్దుల్లాపూర్‌మెట్‌లోని గండి మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మైనింగ్‌జోన్ రద్దు చేయాలని దీక్ష చేస్తున్న రైతులకు మల్‌రెడ్డి రంగారెడ్డి సంఘీభావం ప్రకటించారు. పాదయాత్రలో ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చరికొండలో ఘనంగా బోనాలు



బోనాలతో మహిళలు

కడ్తాల్: మండల పరిధిలోని చరికొండ గ్రామంలో కనకదుర్గామాత విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు నాలుగు రోజులుగా వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం బోనాల ఊరేగింపు నిర్వహించారు. మహిళలు బోనాలతో ఆలయానికి చేరుకుని నైవేద్యం సమర్పించారు. పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర గీతకార్మిక సంఘం నాయకులు అయిలి వెంకన్న, వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చీమర్ల అర్జున్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా చీమర్ల అర్జున్‌రెడ్డి ఆలయ అభివృద్ధికి రూ.10 వేలు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భారతమ్మ, ఎంపీటీసీ రాములుగౌడ్, ఉప సర్పంచ్ నరేశ్ పాల్గొన్నారు.

డిమాండ్ల సాధనకు పోరాటం

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి యాదయ్య

ఇబ్రహీంపట్నం: హక్కుల సాధనకై కార్మికులు ఉద్యమించాలని.. ఎర్రజెండా ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓరుగంటి యాదయ్య అన్నారు. ఖానాపూర్ గేట్ వద్ద గల మహాలక్ష్మి డెయిరీ మిల్క్ కంపెనీ వద్ద శుక్రవారం నిర్వహించిన ఏఐటీయూసీ జెండావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్మికుల హక్కుల సాధనకు తమ సంఘం పోరాటం చేస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను, చట్టాలను కాలరాస్తున్నాయని ఆరోపించారు. కార్మికుల చట్టాలను మార్చి యాజమాన్యాలకు బానిసలుగా చేసేందుకు ప్రభుత్వాలు యత్నిస్తున్నట్లు ఆరోపించారు. కార్మిక చట్టాలనుప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. కనీసవేతన చట్టం అమలు చేయాలన్నారు. ప్రైవేట్ పరిశ్రమల్లో శ్రమ దోపిడీని అరికట్టాలన్నారు. నూతన లేబర్ కోడ్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సామేల్, విజయ్‌కుమార్, అలీమొద్దీన్, అనంతరెడ్డి, రమేష్, కృష్ణ, గాలయ్య, సూర్యకళ పాల్గొన్నారు.

టీపీఎల్ విజేతగా సూపర్ స్టార్స్ జట్టు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండలం తుర్కగూడ గ్రామంలో నిర్వహించిన టీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన జట్లకు శుక్రవారం బహుమతులను అందజేశారు. సూపర్ స్టార్స్ జట్టు ప్రథమ స్థానంలో నిలవగా జయేందర్ జట్టు ద్వితీయ స్థానం దక్కించుకుంది. విజేతలకు మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఏనుగు భరత్‌రెడ్డి, ఉపసర్పంచ్ ఏనుగు నరేందర్‌రెడ్డి నగదు బహుమతులతోపాటు ట్రోఫీని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకుడు కుమార్, గ్రామశాఖ అధ్యక్షులు సురేష్, వార్డుసభ్యుడు వెంకటేశ్ పాల్గొన్నారు.



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న ప్రజాప్రతినిధులు